అన్ని వార్డుల అభివృద్ధే ధ్యేయం

మేయర్ హరివెంకట కుమారి

గాజువాక: జీవీఎంసీలోని అన్ని వార్డుల్లోను అభివృద్ధి పనులు విస్తృతంగా సాగుతున్నాయని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. 66వ వార్డు కైలాసనగర్‌లో రూ.49.50లక్షలతో చేపట్టనున్న నూతన కల్వర్టు, రక్షణ గోడ నిర్మాణ పనులకు ఆమె గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వార్డులోను ఒక వక్క సంక్షేమం, మరోపక్క అభివృద్ధి కనిపిస్తోందన్నారు. మౌలిక వసతుల కల్పనతో వార్డులన్నీ ఎంతో అభివృద్ధి సాధిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణతో అన్ని ప్రాంతాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయన్నారు. సీఎం మార్గదర్శకత్వంలో మహా విశాఖ అద్భుతంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాక అభివృద్ధికి మేయర్ హరి వెంకటకుమారి ఎంతగానో సహకరిస్తున్నారన్నారు. వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జీవీఎంసీ సహాయ ఇంజనీర్ వెంకటరావు, స్థానిక నాయకులు పెదిరెడ్ల ఈశ్వరరావు, కరణం వేణుగోపాలరావు, పేరం రామకృష్ణారెడ్డి, రెడ్డి జగన్నాథం, ఖాజా హుస్సేన్, దేముడుబాబు, గూన శ్రీనివాసరావు, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: అన్ని వార్డుల అభివృద్ధికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మౌలిక సదుపాయాల కల్పనే మా లక్ష్యమని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు.మండలంలో 64 వార్డులో యాతపాలెం, గొడ్డువానిపాలెం, యారాడ, దిబ్బపాలెం ప్రాంతాల్లో రూ.80 లక్షలతో రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు గురువారం ఆమె గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని ప్రాంతాలు అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ప్రజలకు మౌలిక వసతులతో పాటు సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని వివరించారు.రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో విశాఖ నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గం అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేశామన్నారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను, జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఉక్కు ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలి



ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు ఉద్యమంలో ప్రజలందరు భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపునిచ్చారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1113వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాభాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ప్రాణత్యాగంతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం ఎలాంటి పోరాటానికైన కార్మికులు సిద్ధమన్నారు. ప్రధాని మోడీ అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరును మరింత ఉధృతం చేస్తామని..ఉక్కును కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సమరానికి 'సిద్ధం'

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఎన్నికల కురుక్షేత్రానికి సిద్ధం కావాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం సాయంత్రం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ క్షణాన ఎన్నికలు వచ్చినా, అభ్యర్థి ఎవరైనా వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఇటీవల విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జేసీఎస్ క్లస్టర్స్, ఇన్‌చార్జిలు, మండల కన్వీనర్ల సమావేశంలో ఏ క్షణాన ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారన్నారు. అందులో భాగంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ప్రతి బూత్ కమిటీ ఏర్పాటుతో పాటు కన్వీనర్లు, కమిటీ మెంబర్లు తదనుగుణంగా క్రియాశీలకంగా పని చేయడానికి బూత్ లెవల్‌లో పది మంది సభ్యులు నియమించాలన్నారు. ఇప్పటికే గాజువాక నియోజకవర్గంలో అన్ని బూత్‌లకు కమిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇంకా ఎక్కడైనా సభ్యుల నియామకం చేయాల్సి ఉంటే తక్షణమే కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలపై జోరుగా ప్రచారం చేయాలన్నారు. అలాగే లబ్ధిదారులు వారు ఇప్పటి వరకూ పొందిన లబ్ధిని గురించి వివరించాలని సూచించారు. అనంతరం జగనన్న కాలనీ ఇళ్ల పట్టాలు అందుకోని వారికి వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, బొడ్డు నర్సింహపాత్రుడు, రాజాన రామారావు, నాయకులు పల్లా చిన తల్లి, కోమటి శ్రీనివాసరావు, రోజారాణి, ధర్మాల శ్రీను, గొందేశి సత్యారావు, గొందేశి వెంకటరమణారెడ్డి, మొల్లి చిన్న, సిరట్ల వాసు, బొడ్డ గోవింద్, మంత్రి శంకరనారాయణ, రంభ నారాయణమూర్తి, లోకనాథం, వెంపాడ అప్పారావు, అన్నవరం, తాపే బ్రహ్మయ్య, చిత్రాడ వెంకటరమణ, సంపంగి ఈశ్వరరావు, చిక్కా సత్యనారాయణ, మద్దాల అప్పారావు, గొందేశి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

67వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గాజువాక: 67వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులలో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యతనిచ్చామని పేర్కొన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ జోగవానిపాలెం సంతోషిమాత ఆలయం, సింహగిరి ఆస్పత్రి, పెంటయ్యనగర్ ప్రాంతంలో రూ.98.67 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైన్లను నిర్మించనున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు, డీసీఎంఎస్ మాజీ చైర్ పర్సన్ పల్లా చినతల్లి, వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు ఎస్.ఎం.డి.గౌస్, పల్లా పెంటారావు, అన్నపూర్ణ, లక్ష్మి, సూర్య, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మేయర్ వెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి, సమన్వయకర్త చందు

నీటి సరఫరాలో లోపాలను సరి చేయాలి

గాజువాక: 70వ వార్డు శ్రామికనగర్ ప్రాంతంలో నీటి సరఫరాలో చోటుచేసుకున్న సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు జీవీఎంసీ అధికారులను కోరారు. జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులతో కలిసి ఆయన శ్రామికనగర్‌లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. నీటి సరఫరాలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికులు వివరించడంతో లోపాలను సరిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. గాజువాక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కనకారావు, కాలనీ పెద్దలు కొణతాల రాము, సత్యారావు, రాజు, కోటేశ్వరరావు, దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న చందు

వయోశ్రీ యోజన పథకం వృద్ధులకు వరం

పెదగంట్యాడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాష్ట్రీయ వయో శ్రీ యోజన పథకం వృద్ధులకు వరమని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని గంగవరం గ్రామంలో వృద్ధులకు ఉపకరణాలు పంపిణీ చేసేందుకు అవసరమైన వివరాల నమోదు కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన వారు మాట్లాడారు. 60ఏళ్లు దాటిన వృద్ధులకు ఉచితంగా కళ్ల జోళ్లు, వినికిడి యంత్రాలు, చేతి కర్రలు, వీల్‌చైర్లు, నడుం, మోకాళ్ల బెల్టులు, రో లెటర్స్ తదితర పరికరాలు అందజేస్తామన్నారు. లబ్ధిదారులు తమ రేషన్ కార్డు, ఆధార్ కార్డు నకళ్లను తమకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, రవికుమార్, గరికిన పైడిరాజు, వెంకటేష్, పేర్ల అప్పారావు, మాధవి, జీలకర్ర రమణ పాల్గొన్నారు.



వృద్ధుల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కరణంరెడ్డి నరసింగరావు

ఉక్కు సీఎంఎం ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు



స్వామినాథంను సత్కరిస్తున్న అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ మెయింటెనెన్స్ మెకానికల్ (సీఎంఎం) విభాగం జనరల్ ఫోర్‌మెన్‌లు బి.స్వామినాథం, ఓవీ రమణలకు ఘనంగా వీడ్కోలు పలికారు. ప్లాంట్ నుంచి పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా గురువారం విభాగంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విభాగాధిపతి, వివిధ కార్మిక సంఘాల నాయకులు హాజరయ్యారు. వారు ఉద్యోగ జీవితంలో చేసిన కృషిని, కర్మాగార ప్రగతి పాటుపడిన విధానాన్ని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో విభాగాధిపతి నగేష్‌కుమార్, నాగవర్ధన్, నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, వాసు, ప్రకాష్, గంగవరం గోపి, చిన్న వెంకటేశ్వర్లు, వరహాలరెడ్డి, శ్రీను, రామ్మోహన్‌రావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి పకడ్బందీ ఏర్పాట్లు

పెదగంట్యాడ: అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ ఆదేశించారు. ఈ నెల 8న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ సోమేశ్వరస్వామి వారి ఆలయంలో మహోత్సవాలను నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఆలయ ఆవరణలో దేవాదాయశాఖాధికారులతో పాటుగా అన్ని శాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఈ ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారని, రాత్రంతా ఇక్కడే జాగరం చేస్తారని చెప్పారు. మరుసటిరోజు ఉదయం సముద్ర స్నానాలు చేసి.. సోమేశ్వరస్వామిని దర్శించుకుంటారని వివరించారు. ఈ నేపథ్యంలో ఈ ఆలయానికి వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. సముద్ర స్నానాలు చేసే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, , దేవాదాయ శాఖ అధికారులు రాజగోపాల్‌రెడ్డి, ఈవో జగన్నాథం,,జీవీఎంసీ జోనల్ వైద్యాధికారి కిరణ్‌కుమార్, దువ్వాడ పోలీస్ స్టేషన్ సీఐలు ఎర్రంనాయుడు, నాగరాజు,డిప్యూటీ తహశీల్దార్ విజయ్ భాస్కర్, ఆర్టీసీ అధికారులు, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

రమణారావు సేవలు మరువలేనివి

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) ఎంప్లాయిస్ కోఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్‌లో మేనేజర్‌గా వెంకటరమణారావు చేసిన సేవలు మరువలేనివని భెల్ (హెచ్‌పీవీపీ) హెచ్‌ఆర్ మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం రమణారావు పదవీ విరమణ సందర్భంగా ఆయనను ఆయన సతీమణిని ఘనంగా సన్మానించారు. సంస్థకు చెందిన పలు యూనియన్ల ప్రతినిధులు, యాజమాన్యం ప్రతినిధులు పాల్గొన్నారు. రమణారావును పలువురు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు బోండా బాబూరావు, ప్రధాన కార్యదర్శి సుభాకర్ సాహూ, ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, గుర్తింపు యూనియన్ ఉపగౌరవాధ్యక్షుడు కొల్లి దేముడు, కాంగ్రెస్ నాయకుడు గుడివాడ అమ్మన్న, రాము, ప్రశాంత్ కుమార్, గుడివాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గవర వెంకటరమణారావును సత్కరిస్తున్న భెల్ యాజమాన్యం, యూనియన్ల ప్రతినిధులు

యాజమాన్యం అనాలోచిత నిర్ణయాలు విరమించుకోవాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఏకపక్ష, అనాలోచిత నిర్ణయాలను విరమించు కోవాలని స్టీల్ ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. గురువారం సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాజమాన్యం కార్మికుల హక్కులు, సదుపాయాలపై దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. యాజమాన్యంపై ఒత్తిడి తేవాల్సిన గుర్తింపు సంఘం పట్టనట్టు వ్యవహరిస్తోందన్నారు. వేతన సవరణ విషయంలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరగుతుందన్నారు. పూర్తి స్థాయి ఉత్పత్తి చేసేందుకు అవసరమైన వనరులు సమకూర్చుకోలేని పరిస్థితిలో యాజమాన్యం ఉందన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ ఉద్యమాన్ని ఆపేందుకు యాజమాన్యం కుట్ర చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, బీఎస్ రాజు, అవతారం, ప్రభాకరరెడ్డి, ప్రసాద్, నాయుడు, సుదర్శనం, పి.వి. నగేష్, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా 'జగనన్న సురక్ష'

కూర్మన్నపాలెం: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని, మహానేత స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకం నేడు రాష్ట్రంలోని అనేక మంది పేదలకు ఎంతో మేలు చేస్తోందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వడ్లపూడి సచివాలయం-1 ప్రజల సౌకర్యార్థం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని గురువారం గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకంలో పేదలు తమకు నచ్చిన నెట్‌వర్క్ ఆస్పత్రులో వైద్యం చేయించుకునే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ముందుగానే వ్యాధులను గుర్తించి సరైన వైద్య సహాయం అందిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, అందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 250 మంది రోగులకు స్పెషలిస్ట్ డాక్టర్లు పర్యవేక్షణలో వైద్య సేవలను పొందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శివయ్య, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ కోమటి శ్రీనివాసరావు, మండలాధ్యక్షులు బొడ్డ గోవింద్, కోమటి రమాదేవి, దుగ్గపు దానప్పలు, జెర్రిపోతులు ఈశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రోగులకు రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఉక్కు కార్మిక నాయకులపై యువ ఉద్యోగుల ఆగ్రహం

ఉక్కునగరం: బయోమెట్రిక్ అంశంపై స్టీల్‌ప్లాంట్‌లో రెండు రోజుల పాటు జరిగిన పరిణామాల ఫలితంపై యువ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభంలో సీరియస్‌గా ఉన్నట్టు నటించి యాజమాన్యానికి తలొగ్గడం, చివరగా పోలీసుల లాఠీచార్జి జరిగిన తీరును వారు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈనెల 8 నుంచి ప్లాంట్‌లో బయోమెట్రిక్ అమలు చేస్తామని ఇచ్చిన ఉత్తర్వులపై కార్మిక సంఘాలు యాజమాన్యం వద్ద అభ్యంతరం వ్యక్తం చేశారు. బయోమెట్రిక్ అమలుకు తమ అభ్యంతరం లేదని అయితే వేతన సవరణ అమలు, క్యాంటీన్ సదుపాయాలు మెరుగు, తాగునీరు, టాయిలెట్లు తదితర సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యాన్ని నిలదీశారు. సుమారు 30 గంటల పాటు జరిగిన ఆందోళన కార్యక్రమంలో నాయకుల తీరును వారు తప్పుపడుతున్నారు. వాయిదా వేయడం కుదరదని డైరెక్టర్ చెప్పినప్పుడే అప్పుడే ఒప్పుకోవాల్సిన నాయకులు సీఎండీతో చర్చలకు ఎందుకు వెళ్లడం.. అక్కడ కూడా అదే సమాధానం వచ్చినప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారన్న అంశంపై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. జిందాల్ ఒప్పందంపై మొదట హడావుడి చేసిన కార్మిక సంఘాలు తర్వాత మౌనం వహించటాన్ని వారు గుర్తు చేసుకుంటున్నారు. ఈ అంశంతో ప్రధాన కార్మిక సంఘాలన్నీ యువ ఉద్యోగులు విశ్వాసం కోల్పోయాయి అంటే అతిశయోక్తి కాదు. కార్మిక సంఘాలపై విశ్వాసం వదులుకున్న యువ ఉద్యోగులు వేతన సవరణ అంశంపై తామే కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించారు. ఇందు కోసం శుక్రవారం వీరంతా సమావేశమవుతున్నారు.

బీజేపీలో పలువురి చేరిక

గాజువాక: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న పథకాలు, సుస్థిరమైన నాయకత్వంతో బీజేపీ దేశవ్యాప్తంగా బలమైన శక్తిగా ఎదుగుతోందని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు అన్నారు. బీజేపీలో చేరిన పలువురికి ఆయన పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోదీ నాయకత్వంపై నమ్మకంతో అనేకమంది పార్టీలో చేరుతున్నారన్నారు. రానున్న కాలంలో గాజువాకలో కూడా బీజేపీ జెండాను ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు బొండా ఎల్లాజీరావు, గరికిన పైడిరాజు, కిలాని ముసలయ్య, కానూరి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందిపై ఆర్డీవో ఆగ్రహం

కూర్మన్నపాలెం: ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురువుతుండడంతో ఆర్డీవో హుస్సేన్ గాజువాక రెవెన్యూ అధికారులపై మండిపడ్డారు. కూర్మన్నపాలెం సర్వే నెంబర్ 32లోని ప్రభుత్వ భూమిలో రాత్రికి రాత్రే ప్రహరీ గోడ నిర్మించినట్లు స్థానికుల ఫిర్యాదుతో గురువారం ఆక్రమిత స్థలాలను పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతుంటే చర్యలు తీసుకోవడం నిర్లక్ష్యధోరణి సరికాదన్నారు. తక్షణమే ప్రహరీ తొలగించి ఫొటోలు తనకు పంపాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలను కాపాడే బాధ్యత వీఆర్వోలపై ఉందని, ఉదాసీనంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ప్రభుత్వ స్థలాల డాక్యుమెంట్‌లను పరిశీలిస్తున్న ఆర్డీవో హుస్సేన్

నేటి నుంచి వరసిద్ధి వినాయక ఆలయవార్షికోత్సవాలు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-3 షాపింగ్ కాంప్లెక్స్‌లోని వరసిద్ధి వినాయక ఆలయ 18వ వార్షికోత్సవాలు శుక్రవారం జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం సుగంధ ద్రవ్యాలు, పంచామృతాభిషేకం, స్వామి వారి పల్లకి సేవ నిర్వహించనున్నారు. శనివారం సహస్ర పుష్పార్చన (వెండి పుష్పాలతో), పుష్పయాగం చేయనున్నారు. ఆదివారం పిల్లలచే పెన్నులతో సామూహిక సరస్వతి పూజ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం ఫీడర్లు 33/11 కేవీ నిర్వహణ పనులను చేపట్టనున్న దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ముఖ్యంగా శాతవాహననగర్ రోడ్ నంబర్ 1 నుంచి 9, యాతపాలెం, ముస్తఫా జంక్షన్, భరత్‌నగర్, కూర్మన్నపాలెం, ఐటీఐ రోడ్ వంటి ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసున్నట్లు ప్రకటించారు.

నూకాలమ్మ అమ్మవారి ఆలయ పునఃప్రారంభం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు దానబోయినపాలెంలోని నూకాలమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ పునఃప్రారంభ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎల్.వి.రమణ, దానబాల పెద సన్యాసిరావు, అమరపిని వరహాలు, మేడిశెట్టి పైడయ్య, సత్యారావు, భారతిపాల్గొన్నారు.

వేంకటేశ్వరరావు మాస్టార్ సేవలు ఎనలేనివి

అగనంపూడి: మూడున్నర దశాబ్దాల పాటు ఉపాధ్యాయునిగా సేవలు అందించి పదవీ విరమణ పొందిన గొన్నాభక్తుల వేంకటేశ్వరరావు సేవలు ఎనలేనివని పరవాడ మండల విద్యాశాఖాధికార్లు డి.దివాకర రావు, గొంతిన సాయి శైలజ అన్నారు. 85వ వార్డు పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన వేంకటేశ్వరరావును పాఠశాల కమిటీ, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వై.భీమశంకరరావు, లంకెలపాలెం హైస్కూల్ హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, కమిటీ చైర్మన్ కొయ్య వెంకటరావు పాల్గొన్నారు.



వేంకటేశ్వరరావును సత్కరిస్తున్న విద్యా కమిటీ, గ్రామ నాయకులు

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులపై కేసు నమోదు

ఉక్కునగరం: బయోమెట్రిక్ అంశంపై ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమం సంఘటనలో కొంత మంది స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులపై స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఉద్యోగులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులపై దౌర్జన్యం చేశారన్న ఆరోపణలపై ఉక్కు ఉద్యోగి దాసరి శ్రీనివాస్‌తో పాటు మరికొంత మందిపై సెక్షన్ 353 ప్రకారం కేసు నమోదు చేశామని స్టీల్‌ప్లాంట్ సీఐ వి. శ్రీనివాసరావు తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్ లోవ లో రూ.20 లక్షలతో కొత్తగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను సత్వరం పూర్తి చేయాలని సూచించారు. సమస్య విన్న వెంటనే స్పందించి లోవలో రోడ్డు వేయిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు ఎస్‌వై నాయుడు, బొడ్డు గోవింద్, లోకేష్, నాయుడు మాస్టర్, లాలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తిరుమల బాలాజీకు తిరుప్పావడ సేవ



తిరుమల బాలాజీ సన్నిధిలో తిరుప్పావడ సేవలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమల బాలాజీకు తిరుప్పావడ సేవను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ఆలయంలో తిరుప్పావడ సేవలో భాగంగా పులిహోరను రాశులుగా పోసి బాలాజీకు నివేదించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

కల్యాణం కమనీయం



శివ పార్వతుల కల్యాణం చేస్తున్న అర్చకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బాలచెరువులో ఉమారామ లింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉమారామ లింగేశ్వర స్వామి వారిని అర్చకుడు బంకుపల్లి వాసుదేవ శర్మ విశేషంగా అలంకరించారు. ఉత్సవ మూర్తులను భక్తులకు దర్శనం కల్పించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కేవీఎస్ఎన్ రాజు, కార్యదర్శి వాడపల్లి నానాజీ ఆధ్వర్యంలో శివ పార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు పిలక అప్పారావు రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

పెదగంట్యాడ: హెచ్ఐవీ, ఎయిడ్స్ రాకుండా జాగ్ర త్తలు పాటించాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ ఢిల్లీశ్వరి అన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో పెదగంట్యాడ కూడలిలో భద్రం ఫౌండేషన్ కళాజాతి బృందం సహకారంతో యాక్సెప్ట్ మైడ్రేంట్ వారిచే హెచ్ఐవీ, ఎయిడ్స్ పై ప్రచార జానపద కళాజాత కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో గణేష్, కాంచన, కోదండ, మోహన్, భాస్కర్, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.